నేడు జహీరాబాద్‌లో ఇఫ్తార్ విందు

మాజీ మంత్రి కేటీఆర్ రాక

కోహీర్, ఏప్రిల్ 6: జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెషన్ హాలులో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ తెలిపారు. ఇఫ్తార్ విందుకు మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు విందులో పాల్గొనాలని కోరారు.

సామాజిక సేవలకు గౌరవ పురస్కారం

అవార్డుతో గొల్లగూడ శారద

బొల్లారం, ఏప్రిల్ 6: బొల్లారం మున్సిపాలిటీ జెండర్ కమిటీ సభ్యురాలు, సామాజిక కార్యకర్త గొల్లగూడ శారద భారత గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం నగరానికి చెందిన మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో భారతదేశ గౌరవ పురస్కారాలు 2024 పేరిట సామాజిక సేవలు అందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి భారతదేశ గౌరవ పురస్కారాన్ని అందించినట్లు శారద తెలిపారు. అవార్డు అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి సామగ్రి అందజేత

రామచంద్రాపురం, ఏప్రిల్ 6: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి ఆరోగ్య కేంద్రంలో సరైన వసతులు లేవని సిబ్బంది వైస్‌చైర్మన్ రాములు గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన తన కుమారుడు బీఆర్ఎస్ యువజన నాయకుడు సాయిచరణ్ గౌడ్‌తో కలిసి రూ.లక్ష సొంత ఖర్చుతో ఆరోగ్య కేంద్రంలో కావాల్సిన వసతులను సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం సిబ్బంది సూచనల మేరకు వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తామన్నారు.

బెల్టుషాపులపై దాడులు

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

హత్నూర, ఏప్రిల్ 6: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. శనివారం జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హత్నూర ఐటీఐ కాలనీలో కిరాణంలో మద్యం అమ్ముతున్న రాకేశ్, సిరిపురలో గణేశ్, చందాపూర్‌లో శ్రీనివాస్‌రెడ్డి, బోర్పట్లలో ప్రమీల, గడ్డమీది శ్రీనివాస్, గుండ్లమాచునూర్‌లో అంజాగౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదుచేసి వారి ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ సందీప్, డీటీఎఫ్ఎస్ఐ అనుదీప్ పాల్గొన్నారు.

నేడు 'మోడల్' ప్రవేశ పరీక్ష

బొల్లారం, ఏప్రిల్ 6: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు. దీనికోసం ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో కలిపి రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆరో తరగతికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి పదవ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆరో తరగతికి మాత్రమే రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో 240 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 81 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించే పరీక్షకు ఒకే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

బాలల వికాసానికి సాహిత్యం అవసరం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6: బాలల వికాసానికి బాల సాహిత్యం అవసరమని చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. సిద్దిపేటలో బడిపిల్లల కథల పుస్తకాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. బడిపిల్లల కథల పుస్తక సంపాదకుడు ఉండ్రాళ్ల రాజేశం బాలసాహిత్యానికి చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రొఫెసర్ రఘు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత వెంకటరమణ, అనసుయ, అశోక్, సూరి, శర్మ, కృష్ణమూర్తి, జానకీరామ్ తదితరులున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి
- ఉమ్మడి మదక్ జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ భారతీ హోలికేరి

మాట్లాడుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోలికేరి, పక్కన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 6: జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ భారతీ హోలికేరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్టు పత్రికల్లో వార్తలొస్తే వెంటనే స్పందించాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో దృష్ట్యా తాగునీటి సరఫరాకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని జనావాస ప్రాంతాలకు రోజూ తాగునీటి సరఫరా అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాని చోట ఏమైనా చర్యలు చేపట్టారా అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్‌పై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందన్నారు. వేసవి ముగిసే వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య వస్తే గ్రిడ్, ఇంట్రా ఇంజినీర్లు కలిసి పరిష్కరించాలని సూచించారు.

8 మున్సిపాలిటీలు, 26 మండలాలకు సింగూరు జలాలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో 8 మున్సిపాలిటీలు, 26 మండలాలకు సింగూరు నుంచి మంజీరా జలాలను అందజేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా తాగునీటి సరఫరా చేసే అవకాశం ఉన్నదన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు

ప్రాణం తీసిన ఈత సరదా

సింగూరు కెనాల్‌లో పడి యువకుడి మృతి

సింగూరు కెనాల్‌లో మృతి చెందిన వినోద్

పుల్కల్, ఏప్రిల్ 6: సరదాగా ఈతకని వెళ్లిన ఓ యువకుడు సింగూరు కెనాల్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని బస్వాపూర్ శివారులో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దప్పు వినోద్(22) కొన్నేండ్లుగా సదాశివపేట పరిధిలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. వేసవి కాలం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో స్నేహితులతో కలిసి సరదాగా గ్రామ శివారులోని సింగూరు ఎడమ కాల్వలో ఈతకని దిగాడు. వినోద్‌కు ఈత రాదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా నీటిలోకి దిగడంతో మునిగిపోయాడు. స్నేహితులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మత్స్యకారులు, గ్రామస్తులు దిగి రెండు గంటల పాటు గాలించగా అర కిలోమీటర్ దూరం లో మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట దవాఖానకు తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

వైభవంగా వీరభద్రుడి విమాన రథోత్సవం

విమాన రథోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

గుమ్మడిదల, ఏప్రిల్ 6: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి విమాన రథోత్సవంలో పురవీధుల మీదుగా ఊరేగుతూ అశేష భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే రుద్రావతారుడిని దర్శించుకొని భక్తులు పులకించిపోయారు. మండలంలోని వీరన్నగూడెం – బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం విమాన రథోత్సవం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా భక్తుల కోలాటాలు, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈవో శశిధర్‌గుప్తా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీంద్రమూర్తి, సోమయ్య, ఆలయవతనుదారులు, ఆలయ మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, సద్దివిజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కల్హేర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ శ్రేణులు జెండా ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. దేశంలో మరోసారి బీజేపీ సర్కార్ రావడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరోసారి మోదీని ప్రధానిని చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటి ప్రచా రం నిర్వహించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 6

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని వినడానికి గ్రామాలు, పట్టణాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 6

జిన్నారం: కొడకంచి గ్రామం నుంచి కాంగ్రెస్ సభకు వెళ్తున్న నాయకులు

తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తికి రిమాండ్

మనోహరాబాద్, ఏప్రిల్ 6: ఓపెన్ ప్లాటుకు సంబంధించి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన వ్యక్తిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామ శివారులో నగరానికి చెందిన సత్యనారాయణమూర్తికి చెందిన ఓపెన్ ప్లాటుకు సంబంధించి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించారన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో నగరానికి చెందిన ఖందవల్లి రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మతోన్మాద బీజేపీని ఓడిద్దాం

కొమురవెల్లి, ఏప్రిల్ 6 : మతోన్మాద బీజేపీని ఓడించి, సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. శనివారం మండలంలోని రాంసాగర్‌లో తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, నాయకులు దాసరి ప్రశాంత్, అరుణ్‌కుమార్, తాడూరు మల్లేశం, నీల భిక్షపతి, తాడూరి నరేశ్, దాసరి మహేశ్, చింతల శ్రీనివాస్, తాడూరి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. శుక్రవారం రాత్రి మద్దూరు మండలంలోని సలాఖపూర్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ యూనూస్‌అహ్మద్ అలీ, కళాబృందం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆదాయం రూ.7,47,890

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 6: కొండపోచమ్మ దేవాలయానికి హుండీ ద్వారా రూ.7,47,890 ఆదాయం వచ్చిందని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తీగుల్‌నర్సాపూర్ ప్రసిద్ధ కొండపోచమ్మ దేవాలయం హుండీని దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, సిబ్బంది కనకయ్య, హరిబాబు, చిన్న అంజయ్య, పూజారులు గర్నెపల్లి రమేశ్, లక్ష్మణ తిరుపతి, గోవర్ధన్, కొండయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

అందోల్, ఏప్రిల్ 6: జోగిపేటలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం జోగిపేటలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీని గెలిపించి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలన్నారు. జహీరాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే జోగిపేట ప్రాంతాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, పార్టీ ప్రధానకార్యదర్శి అనంతరావుకుల కర్ణ, జిల్లా ఉపాధ్యాక్షుడు ప్రభాకర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ చెంద్రశేఖర్‌ఉన్నారు.

'సువిధ'లో నామినేషన్‌కు అవకాశం

జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 6: సువిధ పోర్టల్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్ వేసుకునే సౌకర్యం ఉన్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అభ్యర్థి నామినేషన్ పత్రాలు సమర్పించే విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. అభ్యర్థి నామినేషన్ పత్రాలు ఎలా సమర్పించాలి అనే అంశంపై వివరించారు. గత నెల 16న ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ జారీ చేసిందని తెలిపారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్, 25న నామినేషన్స్ స్వీకరణకు చివరి తేదీ అని, 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి ఫారం 1లో పబ్లిక్ నోటీస్ జారీ చేస్తారని, ప్రజల సభకు నామినేషన్ వేసే అభ్యర్థి ఫారం–26లో అఫిడవిట్‌తో పాటు ఫారం 2ఏ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 33 ప్రకారం ప్రజల సభకు ఎన్నికల్లో అభ్యర్థిని ప్రతిపాదిస్తారన్నారు. సెక్షన్ 34 ప్రకారం ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరుమలను దర్శించుకున్న ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, తదితరులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 6: తిరుమల శ్రీవారిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం తిరుపతి వెళ్లిన గూడెం మహిపాల్‌రెడ్డి తిరుమలలో స్వామివారిని దర్శించుకొని సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి వెంకన్న ఆశీస్సులతో పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన శ్రేణులు



జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌తో బీఆర్ఎస్ నాయకులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమవేశానికి పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంటేనే బీఆర్ఎస్ అని, జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీచేస్తున్న గాలి అనీల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ సమావేశానికి నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, సంగ్రాంపాటిల్, భూమరెడ్డి, అప్పారావుపాటిల్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, దేవదాస్, హసన్, మాజీ సర్పంచ్‌లు కుతుబొద్దీన్, మారుతీయాదవ్, అమీర్, మల్లారెడ్డి తరలివెళ్లారు.

ఆర్ఎంసీ ప్లాంట్‌ని తొలిగించాలి

ఆర్ఎంసీ ప్లాంట్ ఎదుట నిరసన తెలుపుతున్న మైహోం అంకురవాసులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 6: తెల్లాపూర్‌లో రేడియల్ రోడ్డుకు ఆనుకొని శిల్పా డ్రీమ్ వ్యాల్యూ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ప్లాంట్‌ని తొలిగించాలని మైహోం అంకురవాసులు శనివారం ఆర్ఎంసీ ప్లాంట్ ఎదుట నిరసన చేపట్టారు. బ్యాన్ ఆర్ఎంసీ, స్టాప్ పొల్యూషన్, సేవ్ ఎన్విరాన్మెంట్ అంటూ ప్లాకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మైహోం అంకుర అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఆర్ఎంసీ ప్లాంట్‌ని ఏర్పాటు చేయడంతో చాలా ఇబ్బందులు వస్తున్నాయని, దుమ్ము, దూళి ఇండ్లల్లోకి వస్తుందని తెలిపారు. ఈ ప్లాంట్‌తో కాలనీవాసులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉన్నదన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆర్ఎంసీని ఇక్కడి నుంచి తొలిగింపజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దినేశ్, రాఘురాంరెడ్డి, గణేశ్, రాజేందర్, శ్రీకాంత్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బొల్లారంలో ఫ్లాగ్‌మార్చ్

బొల్లారం పారిశ్రామికవాడలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

బొల్లారం, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని హనుమాన్ టెంపుల్, కొత్త బస్టాండ్, బీరప్ప బస్తీ, చర్చి బస్తీ, కేబీఆర్ కాలనీ, వైఎస్సార్ కాలనీలో కవాతు చేశారు. అనంతరం బొల్లారం సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. ఎస్సీ రూపేశ్ ఆదేశాల మేరకు బొల్లారంలో కేంద్ర సాయుధ బలగాలతోపాటు ఐటీబీపీ భద్రతా సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సీఐలు, ఎస్సైలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

గొర్రెకల్ గ్రామ శివారులో మొరం తవ్వుతున్న జేసీబీ

వట్‌పల్లి, ఏప్రిల్ 6: వట్‌పల్లి మండలంలో మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతున్నది. ఈ దందా కొందరికి కాసులు కురిపిస్తున్నది. అధికార పార్టీ నేతల అండదండలతో ఈ దందా నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వారం రోజులుగా ఉసిరికపల్లి శివారులో అసైన్డ్ భూములు, చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. గురువారం రాత్రి సైతం మట్టిని తరలించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, కొంతమంది కాంగ్రెస్ నాయకులు రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలిసింది. అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు అమలు కావడం లేదు. మంత్రి ఇలాఖాలోనే ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.